క్లుప్తంగా

ఎంపీ డీకే అరుణకు శుభాకాంక్షలు



డీకే అరుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కేశంపేట: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) సలహామండలి చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపీ స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహయాదవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంచుకోట మహేష్, జిల్లా సాంస్కృతిక శాఖ కో కన్వీనర్ నరేందర్‌రెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మురళీకృష్ణ యాదవ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడలో గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందిన కాత్రమోని నర్సింహులు కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో నర్సింహులు మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేత మురళీకృష్ణ యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నర్సింహులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు వెంకటేష్, యాదయ్య తదితరులున్నారు.

సమష్టి సహకారంతో అభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశం

చేవెళ్ల: ప్రజల్లో వచ్చే మార్పుతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశం అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని 12 గ్రామాల విలీనంతో 6 నెలల క్రితం ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకునేందుకు అందరూ సహకరించాలన్నారు. టీచర్స్ కాలనీ, కమలానగర్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా చాలా అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి నిర్మాణానికి తప్పనిసరిగా అనుమతులు తీసుకొని, మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

గాయపడిన నేతకు పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: దాడిలో గాయపడిన మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత రవీందర్‌రెడ్డిను నాయకులు పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పరామర్శించి దాడి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. పరామర్శించిన వారిలో శివారెడ్డి, వెంకటేష్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంచాయతీ అవార్డులపై అవగాహన

కేశంపేట: జాతీయ పంచాయతీ అవార్డుల కోసం మండలంలోని అన్ని గ్రామాల వివరాలను పొందుపర్చాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. జాతీయ అవార్డులను 9 కేటగిరీల్లో ఇవ్వనున్నారని తెలిపారు. అవార్డుల కోసం సంబంధించిన ప్రశ్నలను పూర్తిగా చదవాలన్నారు. అనంతరం పూర్తి సమాచారంతోనే సమాధానం రాయాలని సూచించారు. తహసీల్దార్ అజాంఅలీ, ఏఓ శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు నాగర్‌గూడ బస్టాండ్



గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

వసతుల్లేని నాగర్‌గూడ బస్టాండ్

బురదమయమవుతున్న ఆవరణ
- మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

షాబాద్: మండల పరిధిలోని నాగర్‌గూడ బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 30 ఏళ్ల క్రితం ఈ బస్టాండ్ నిర్మించగా ప్రస్తుతం మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక అవస్థలు పడుతున్నారు. టాయ్‌లెట్స్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు, విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఈ బస్టాండ్ ద్వారా ప్రతి రోజు దేవరంపల్లి, ఏట్ల ఎర్రవల్లి, తిర్మలాపూర్, కద్మూర్, రేగడిదోస్వాడ, తిమ్మారెడ్డిగూడ, లక్ష్మారావుగూడ, తాళ్లపల్లి, పోతుగల్, రుద్రారం, తదితర గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇక్కడి నుంచి షాద్‌నగర్, వికారాబాద్, రాజేంద్రనగర్ డిపోలకు చెందిన బస్సులు వెళ్తుంటాయి. సమీప ప్రయాణికులు చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్ మండలాలకు వెళ్లడానికి ఇక్కడే బస్సు మారుతారు. ప్రతిరోజు వందల సంఖ్యలో ఇక్కడి నుంచి ప్రయాణం చేస్తుంటారు. బస్టాండ్‌లో బెంచీలు లేకపోవడంతో సమీపంలోని దుకాణాల వద్ద బస్సు కోసం వేచి ఉండాల్సి వస్తోంది. వర్షం కురిస్తే బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారుతోంది. శుక్రవారం కురిసిన వానకు గుంతల్లో నీళ్లు నిలిచి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తోంది.

పట్టించుకోవడం లేదు



బస్టాండ్‌లో మూత్రశాలలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కంట్రోలర్, ఆర్టీసీ అధికారులకు చాలా సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు చేవెళ్ల, షాద్‌నగర్, షాబాద్, శంషాబాద్ వెళ్లడానికి ఇక్కడే దిగుతారు.

– మల్లేశ్, సహకార సంఘం, వైస్ చైర్మన్, షాబాద్

గుంతలు పూడ్చాలి



వర్షం కురిస్తే నాగర్‌గూడ బస్టాండ్ ఆవరణ బురదమయంగా మారిపోతోంది. గుంతల్లో నీళ్లు నిండిపోవడంతో బురదలోనే నిలబడి బస్సు ఎక్కాల్సి వస్తోంది. వెంటనే గుంతలు పూడ్చి బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

– జాకీర్ షరీఫ్, వరల్డ్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడు

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. బేస్మెంట్, స్లాబ్ నిర్మాణం పూర్తి చేసిన వారం రోజుల్లోనే బిల్లులు లబ్ధిదారుల ఖాతాలలో జమ అవుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలతో పాటుగా నాణ్యత తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఇళ్ల పనులు ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మల్లేశం, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిదేవిగా అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు ఆలయంలో ఆషాఢమాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలయంలోని భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భ్రమరాంబికాదేవి భక్తులకు శాకాంబరిదేవిగా దర్శనమించారు. వివిధ రకాల ఆకులు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. భక్తిశ్రద్ధలతో ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

మీర్‌పేటలో నాకాబందీ

మీర్‌పేట: రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి ప్రధాన కూడళ్లలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. సరైన పత్రాలు, నంబర్ ప్లేటు లేని 32 వాహనాలను గుర్తించి సీజ్ చేశామని తెలిపారు.

ఏబీవీపీ నగర కమిటీ ఎన్నిక



మధుసూదన్



నవీన్‌నాయక్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ శంషాబాద్ జిల్లా కన్వీనర్ చందు సమక్షంలో నూతన నగర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ.. జ్ఞానం, శీలం, ఏకత పరిషత్ ప్రత్యేకతలని, యువకులలో దేశభక్తి పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యమన్నారు. అనంతరం నూతన నగర కమిటీ అధ్యక్షుడిగా మధుసూదన్, కార్యదర్శిగా నవీన్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, ఈశ్వంత్, మనోజ్, పవన్ కల్యాణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమించిన తండావాసులు



నిమ్మరసం తాగి దీక్ష విరమిస్తున్న కొండకల్ తండావాసులు

శంకర్‌పల్లి: తమ భూముల కోసం 188 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షను కొండకల్ తండావాసులు శుక్రవారం విరమించారు. ఈ సందర్భంగా అడ్వకేట్ క్రిష్ణ, నాయకుడు రాజు తండావాసులకు నిమ్మరసం ఇచ్చి, దీక్ష విరమింపజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సమస్యలపై అపర్ణ కంపెనీ యాజమాన్యం సానుకూలంగా స్పందించి, తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇరువర్గాలు గతంలో పరస్పరం నమోదు చేయించుకున్న పోలీసు కేసులు, తదితర అంశాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు. గతంలో అపర్ణ కంపెనీకి సహకరించినట్లుగానే, భవిష్యత్తులోనూ తమ సహకారం ఉంటుందని సంయుక్త ప్రకటన చేశారు.

ఊరూరా బోనాల వైభవం



షాద్‌నగర్‌రూరల్: బోనాల ఊరేగింపులో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలే, విద్యార్థినులు

చేవెళ్ల: మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రోని కోటాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ప్రజలంతా కలిసి గ్రామదేవత పోచమ్మకు బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. చిన్నా పెద్దా అంతా కలిసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో గ్రామస్తులు విజయ్‌కుమార్, వెంకటస్వామి, మల్లేశ్, శంకరయ్య, రాములు, మహేందర్, రాజు, నర్సింలు, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఊరేగింపు

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని వివిధ గ్రామాల్లో బోనాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి.

ప్రత్యేక పూజలు

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో శుక్రవారం మైసమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పోతురాజులు, శివసత్తుల ఆట పాటలతో బోనాలు ఊరేగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బోనమెత్తిన విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: మనదేశ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు బోనాలతో కళాశాల ఆవరణలో ఊరేగింపును నిర్వహించారు. విద్యార్థినుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: నెత్తిన బోనాలతో మహిళలు



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో ఊరేగింపు



చేవెళ్ల: బోనాల ఉత్సవాల్లో గ్రామస్తులు

రసీదు లేకుండా విక్రయాలు



రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శిరీష

- పురుగు మందులు అమ్ముతున్న ఫర్టిలైజర్ నిర్వాహకుడు
- ప్రశ్నించిన రైతులపై దురుసు ప్రవర్తన
- ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించిన కర్షకులు
- స్పందించిన వ్యవసాయ అధికారి

కేశంపేట: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాల సమయంలో రసీదులు తప్పనిసరి అని పదేపదే వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నా కొందరు ఫర్టిలైజర్ నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బిల్లులు లేకుండా ఎరువుల విక్రయాలు చేస్తుండగా ప్రశ్నించిన రైతులపై షాపు యజమాని దురుసుగా ప్రవర్తించిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేశంపేట గ్రామానికి చెందిన చిర్ర యాదయ్య, కడియల అంజయ్య కలుపు మందు కోసం స్థానికంగా ఉన్న శ్రీనివాస నాగలి సీడ్స్, పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లారు. అక్కడ నానో డీఏపీ లీటర్ బాటిల్ కొనుగోలు చేశారు. మిగతా షాపుల కన్నా అధికంగా తీసుకున్నట్లు గుర్తించి, నిర్వాహకుడిని గట్టిగా నిలదీశారు. దీంతో షాపు యజమాని రైతులతో దురుసుగా ప్రవర్తించాడు. మిగతా షాపుల కన్న అధికంగా డబ్బులను వసూళ్లు చేస్తూ దబాయించడంపై కర్షకులు వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. సరైన సమాధానం రాకపోవడంతో రోడ్డుపైన బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

దుకాణం మూసివేత

సరైన బిల్లును ఇవ్వకుండా రైతుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తూ రోడ్డు పైన బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడికి మండల వ్యవసాయ అధికారి శిరీష వచ్చి రైతులతో మాట్లాడి వివరాలను సేకరించారు. బిల్లులను పరిశీలించిన ఆమె దుకాణ నిర్వాహకుడితో మాట్లాడి ఇలాంటి బిల్లులతో ఎంత మందికి విక్రయించారో వివరాలను అందించాలని తెలిపారు. రైతుల సూచనల మేరకు దుకాణాన్ని మూసి వేయించారు. అనంతరం పోలీసులు రైతులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు.

సంతకాలు తప్పనిసరి

ఫర్టిలైజర్ దుకాణంలో వ్యవసాయ అధికారులు సంతకం చేసిన బిల్లులు మాత్రమే ఉంటాయి. కానీ షాపు నిర్వాహకుడు కంప్యూటర్ ద్వారా బిల్లులను అందిస్తున్నాడు. బిల్లుపైన జీఎస్టీ నంబర్ కూడా లేకపోవడం గమనార్హం. నిర్వాహకుడి సంతకంతో పాటుగా కొనుగోలు చేసిన రైతు సంతకం చేయాల్సి ఉంటుంది. కానీ శుక్రవారం రైతుకు ఇచ్చిన బిల్లులో ఇవేవి లేవు. నిరసన కార్యక్రమంలో రైతులు రమణరెడ్డి, సాజిద్, రాంచందర్, రవి, సతీష్, శేఖర్‌యాదవ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్వర్తి గ్రామంలో రూ.41.60 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామీణ రోడ్లను అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలు ఎప్పటికప్పుడూ అధికారులను అడిగి తెలుసుకొని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గోవిందమ్మ, నాయకులు పాపారావు, మనీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆలయాల నిర్మాణాలకు తోడ్పాటు



చేవెళ్ల: ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ఎంపీటీసీ మాజీ సభ్యురాలు



కేశంపేట: విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్

చేవెళ్ల: మండలంలోని దేవరంపల్లి హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎన్కేపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు వనం మాధవిలక్ష్మీ కాంత్‌రెడ్డి దంపతులు రూ.2 లక్షల విరాళం గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సమష్టిగా ఉండి ఆలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరహరిరెడ్డి, నాయకులు మానిక్యరెడ్డి, మల్లేశ్, రవీందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘుపతిరెడ్డి, రాజు, నరేందర్‌రెడ్డి, ఆనంద్‌చారి, గోవింద్‌రెడ్డి, ముకుంద్‌రెడ్డి, మధుసుధన్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని లింగంధనలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మాజీ సర్పంచ్ ఎద్మ రాంరెడ్డి రూ.1,02,116 విరాళంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మడయ్య, చిన్న రామస్వామి, కృష్ణయ్య, జంగయ్య, కృష్ణ, సురేందర్, భాస్కర్, బాలస్వామి, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని కాపాడుకుందాం



సమావేశంలో నినదిస్తున్న నాయకులు

కొత్తూరు: అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉండాలని కుల అసమానతల నిర్మూలన సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజన ఆధ్వర్యంలో మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం రాత్రి కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... నాడు కారంచేడులో దళితులపై జరిగిన మారణకాండకు నేటికి నలభై ఏళ్లు పూర్తయినట్లు చెప్పారు. దళితులపై ఆరోజు జరిగిన ఘటనతోనే ఎస్సీ, ఎస్టీ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. పీడితులు ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనకృష్ణ, నాయకులు చక్రవర్తి, లక్ష్మయ్య, నరేష్, బబ్లు, భిక్షపతి, కౌసల్య, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

చినుకు పడితే రోడ్డు చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి మండలంలోని ఎల్గొండగూడ నుంచి వీరాపూర్ వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– షాబాద్

